సాక్షి అనకాపల్లి

గురువారం । 1 । ఆగస్టు । 2024



వెన్నలపాలెంలో షూటింగ్

'రాయివలస' టైటిల్‌తో తీస్తున్న సినిమాలో పలు సన్నివేశాలను ఇక్కడ లాలం సింహాచలం పాత పెంకుటిల్లులో చిత్రీకరించారు. 8లో



ఈపీడీసీఎల్‌లో పదోన్నతులు

ఈపీడీసీఎల్ పరిధిలో పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. 8లో



రహదారి భద్రతపై అవగాహన

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా రవాణా శాఖాధికారి జి.మనోహర్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

నేడు ఎస్‌ఎంసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- డీఈవో మహాలక్ష్మమ్మ



చోడవరం రూరల్: జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 2024–25 విద్యా సంవత్సరానికిగాను పాఠశాల మేనేజిమెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల షెడ్యూలు గురువారం విడుదల కానున్నట్టు డీఈవో ఎం.మహాలక్ష్మమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సెప్టెంబర్ 21వ తేదీతో కమిటీల కాలపరిమితి ముగిసినందున, వాటి స్థానే నూతన కమిటీలను విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకోనున్నారు. ఈ నెల 5న అర్హులైన తల్లిదండ్రుల ఓటరు జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, అదే రోజు మధ్యాహ్నం తుది జాబితాల ప్రకటన, 8న ఉదయం తరగతుల వారీగా కమిటీ సభ్యుల ఎన్నిక, మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక, 2 గంటలకు సభ్యుల ప్రమాణ స్వీకారం, అనంతరం బాధ్యతలను స్వీకరిస్తారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

యుద్ధప్రాతిపదికన తాండవ గండి పూడ్చివేత



గండి పూడ్చివేత పనులు చేయిస్తున్న తాండవ ప్రాజెక్టు జేఈ రామకృష్ణ

సాక్షి ఎఫెక్ట్..

నాతవరం: తాండవ కుడి కాలువకు పడిన గండికి పూడ్చివేత పనుల్ని అధికారులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. ఈ నెల 26న తాండవ ప్రధాన కుడి కాలువకు గండి ముప్పుపై సాక్షిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ప్రాజెక్టు డీఈ అనురాధ, స్థానిక ప్రజాప్రతినిధులు గండి పడిన ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ గండిని పూడ్చకపోతే కుడి కాలువ ప్రాంతంలో ఉన్న రెండు మండలాల పరిధిలో 20 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు నీరు నిలిచిపోతుంది. దీంతో అధికారులు మూడు రోజులుగా గండి పూడ్చివేత పనులు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టు జేఈ రామకృష్ణ ఆధ్వర్యంలో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గండిని పూడ్చివేసి శిథిలమైన సిమెంట్ లైనింగ్‌ను పునరుద్ధరించారు. గండి పనులు త్వరితగతిన పూర్తిచేయడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాకవరపాలెం ఎంపీపీ రాజీనామా



సీఈవోకు రాజీనామా అందిస్తున్న సత్యనారాయణ

మాకవరపాలెం: ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తన పదవికి రాజీనామా చేశారు. మండలంలోని శెట్టిపాలెం ఎంపీటీసీ సభ్యుడిగా గెలుపొందిన ఆయన్ను సభ్యులంతా ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత కారణాలతో ఆయన బుధవారం జెడ్పీ సీఈవో పోలినాయుడుకు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. రాజీనామాను ఇంకా ఆమోదించాల్సి ఉంది.

అంగట్లో తహసీల్దార్ పోస్టు

రెవెన్యూ శాఖలో కీలకమైన తహసీల్దార్ పోస్టులో తమ అనుయాయుల నియామకానికి కూటమి నేతలు పైరవీల్లో పోటీ పడుతున్నారు. ముఖ్యంగా భూముల ధరలు ఆకాశాన్నంటే హైవే, పారిశ్రామిక ప్రాంతాల్లో అనుకూల తహసీల్దార్‌ల నియామకం కోసం సిఫారసు జాబితాలు సిద్ధం చేశారని, ఒక్కో పోస్టు కోసం లక్షలాది రూపాయలు వసూలు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి

- ఒక్కో పోస్టింగ్‌కు రూ.10 లక్షలు!
- బేరం పెట్టిన కూటమి నేతలు
- అనుకూల తహసీల్దార్ల బదిలీలకు మూడు జాబితాలు
- హైవే, పారిశ్రామిక ప్రాంతాల మండలాలకు గిరాకీ
- పైరవీలపై కలెక్టరేట్లో సుదీర్ఘ మంతనాలు
- అనుభవం ఉన్నవారికే అవకాశం ఇవ్వాలన్న కలెక్టర్
- దీంతో జాబితా సిద్ధమైనా సంతకం చేయని వైనం



సాక్షి, అనకాపల్లి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా తహసీల్దార్ల పోస్టింగ్‌లు, బదిలీలపై జిల్లాలో ఆసక్తి నెలకొంది. ఈ బదిలీల్లో పైరవీలకే పెద్ద పీట వేసినట్టు సమాచారం. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల సిఫారసులకే అగ్రతాంబూలం ఇచ్చినప్పటికీ కీలక మండలాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొన్నారు. తుదిగా స్థానిక ఎమ్మెల్యేలదే పైచేయిగా నిలిచిందని వినికిడి. కూటమికి చెందిన ఎమ్మెల్యేలు చెప్పిన వారికే మంచి పోస్టింగ్‌లు లభించాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంత మంది తహసీల్దార్లకు కీలక మండలాలు కేటాయించారని తెలుస్తోంది. ఒక్కో పోస్టింగ్‌కు మండలాన్ని బట్టి రూ.10 లక్షల వరకూ వసూలు చేశారని రెవెన్యూ వర్గాల్లోనే చర్చ జరుగుతోంది. గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న తహసీల్దార్లు కాసింత ముడుపులు ఎక్కువగా చెల్లించుకున్నట్టు చెబుతున్నారు.

ఆరోపణలున్న వారికి పెద్ద పీట

ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికే తిరిగి కీలక మండలాల్లో పోస్టింగ్‌లు కల్పించారని రెవెన్యూ శాఖలో తీవ్రమైన చర్చ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి కూటమి నాయకుల సిఫారసు లేఖల కోసం చాలామంది తహసీల్దార్లు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకున్నారు. వారిలో తమకు అనుకూలంగా ఉన్నవారిని, గత టీడీపీ ప్రభుత్వంలో సత్సంబంధాలు ఉన్న వారిని మళ్లీ కోరుకున్న స్థానాల్లోకి తెచ్చుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి మూడు జాబితాలు వచ్చాయని, వాటి నుంచి తుది జాబితాను సిద్ధం చేయడానికి కలెక్టరేట్లో సుదీర్ఘ కసరత్తు నడిచిందని సమాచారం. వాటిలో చాలావరకూ పనిచేశాయి. కొన్ని కీలకమైన స్థానాల విషయంలో కలెక్టర్ విజయ కృష్ణన్ సిఫారసులను పక్కన పెట్టినట్టు తెలుస్తోంది.

అవి 'హాట్' సీట్లు!

పారిశ్రామిక ప్రాంతమైన అచ్యుతాపురం, రాంబిల్లి, పరవాడ తహసీల్దార్ పోస్టులకు మంచి డిమాండ్ ఉంది. విశాఖ నగరానికి సమీపంలో ఉన్న సబ్బవరం, అనకాపల్లి, చోడవరంతో పాటు హైవేను ఆనుకుని ఉన్న నక్కపల్లి, యలమంచిలి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లో భూముల ధరలు అమాంతంగా పెరిగిన నేపథ్యంలో తహసీల్దార్ పోస్టుకు విపరీతమైన పోటీ ఏర్పడింది. ఇందులో రూ.లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనకాపల్లి జిల్లాలో పరవాడ–అచ్యుతాపురం సెజ్ ప్రాంతంలో ఉన్న అచ్యుతాపురం, పరవాడ, రాంబిల్లితో పాటు హైవేను ఆనుకుని ఉన్న సబ్బవరం, అనకాపల్లి, యలమంచిలి, నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాలు హాట్ సీట్లుగా ఉన్నాయి. ఒక్కో మండల పోస్టుకు రూ.10 లక్షల వరకూ ప్రజాప్రతినిధులకు చేరాయన్న ఆరోపణలున్నాయి. వీటిలో పాటు చోడవరం, నర్సీపట్నం పోస్టులకు కూడా గట్టి పోటీ ఎదురైంది. మొత్తంగా 24 మంది తహసీల్దార్ల పోస్టింగ్‌లకు జాబితా సిద్ధమైంది. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ టేబుల్‌పై ఉంది.

జాబితా సిద్ధం



రాష్ట్ర రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో పోస్టింగ్‌లకు ఉత్తర్వులు ఇంకా ఇవ్వలేదు. రాష్ట్రంలో కొన్ని జిల్లాలకు పోస్టింగ్ కల్పించినా.. మరికొన్ని జిల్లాల్లో హోల్డ్‌లో ఉంచారు. పోస్టింగ్, బదిలీల జాబితా సిద్ధంగానే ఉంది. ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు వచ్చిన మరుక్షణమే విడుదల చేస్తాం.

– కె.విజయ కృష్ణన్, కలెక్టర్

ఆర్థో సర్జరీల్లో రాష్ట్రంలోనే నక్కపల్లి ఆస్పత్రి ప్రథమం

- ఆరోగ్యశ్రీ పథకంలో 15 రోజుల్లో 30 సర్జరీలు



సర్జరీ చేసిన అనంతరం రోగితో డాక్టర్, సిబ్బంది

నక్కపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద అత్యధికంగా ఎముకల సర్జరీలు చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సంపాదించుకుంది. ఆర్థోపెడిక్ డాక్టర్ ఏ రవికిరణ్ ఆధ్వర్యంలో గత నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు 30 సర్జరీలు చేయగా, వీటితోపాటు వైద్య సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఆస్పత్రి అభివృద్ధికి రూ.2.20 లక్షల నజరానా ప్రకటించింది. సర్జరీలు చేయించుకున్న రోగులకు కొంత మొత్తం నగదు నజరానా ఇస్తుందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఏడాది క్రితం ఇక్కడ ఆర్థోపెడిక్ సర్జన్‌ను నియమించడం వల్ల ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య కూడా పెరిగింది. సాధారణ ఓపీ రోజుకు 300 నుంచి 500 వరకు ఉండగా, ఆర్థోపెడిక్ కేసులు రోజూ 100కి పైగానే వస్తుంటాయి. గత వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఆస్పత్రిని 30 నుంచి 50 పడకల స్థాయికి పెంచారు. పీడియాట్రిషియన్, ఆర్థోపెడిక్, గైనిక్, డెంటిస్ట్, జనరల్ ఫిజిషియన్ తదితర వైద్యులను నియమించారు. ఇదిలావుంటే రాష్ట్ర వ్యాప్తంగా 50 పడకల స్థాయి ఆస్పత్రులు 150 ఉండగా, వీటిలో గత నెల ఆరోగ్యశ్రీ ద్వారా చేసిన సర్జరీలపై బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఏ సిరి సమీక్షించారు. వాటిలో నక్కపల్లి ఆస్పత్రి 15 రోజుల్లోనే అధికంగా 30 సర్జరీలు చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఆర్థోపెడిక్ సర్జన్ ఏ రవికిరణ్‌ను ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది అభినందించారు.

గంజాయి కేసుల్లో నిందితులను అరెస్టు చేయాలి



నెలవారి నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

- బ్యాంక్‌లు, ఏటీఎం కేంద్రాల వద్ద నిరంతర గస్తీ
- నెలవారి నేర సమీక్షలో ఎస్పీ దీపిక

అనకాపల్లి: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను తక్షణమే గుర్తించి కోర్టులో హాజరు పర్చాలని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాపర్టీ కేసులు, 174 సీఆర్పీసీ కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసులను వివరించారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు జిల్లాల నుంచి, ఏజెన్సీ ప్రాంతం వైపు నుంచి వివిధ మార్గాల్లో గంజాయి అక్రమ రవాణాను గుర్తించడం, ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సేకరించి ఆకస్మిక, డైనమిక్ వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో పోలీస్ సిబ్బంది పాత్ర ఉన్నట్లు విచారణలో తేలితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాల పట్ల పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని, దర్యాప్తును సమగ్రంగా నిర్వహించి నిందితులకు కోర్టులో శిక్షలు పడే విధంగా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. నేరాల నియంత్రణకు రేయింబవళ్లు గస్తీలను ముమ్మరం చేయాలన్నారు. బ్యాంకులు, ఏటీఎంల వద్ద తనిఖీలు నిర్వహించాలన్నారు. పాత నేరస్తులపై నిఘా పెట్టాలన్నారు. ప్రజలకు నేరాలపై, సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు ఎక్కువగా నమోదు చేయాలన్నారు. అనంతరం వివిధ కేసుల్లో ప్రతిభ కనబర్చిన జిల్లాలోని 15 మంది పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలందించి ఆమె అభినందించారు. పదవీ విరమణ చేసిన ఏఆర్ ఎస్ఐ టి.సత్యనారాయణను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్, డీఎస్పీలు బి.అప్పారావు, కె.వి.సత్యనారాయణ, ఎం.ఉపేంద్ర బాబు, పి.నాగేశ్వరరావు, సీఐలు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, గణేష్, సతీష్, మన్మథరావు, నరసింహమూర్తి, సంజీవరావు, ఎస్ఐలు రామారావు, రఘువర్మ, తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా 'ఎమ్మెల్సీ' ఎన్నికల కోడ్ అమలు

- యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి
- స్పష్టం చేసిన కలెక్టర్ హరేందిర ప్రసాద్
- వెబెక్స్ ద్వారా అధికారులతో సమీక్ష



వెబెక్స్ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన నేపథ్యంలో తక్షణం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. సామాజిక పింఛన్ల పంపిణీ అధికారుల సమక్షంలోనే జరగాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలపై బుధవారం ఆయన కలెక్టర్ కార్యాలయం నుంచి వెబెక్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

6న నోటిఫికేషన్

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదల చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 13 వరకు నామినేషన్ల స్వీకరణ, 14న పరిశీలన, 16 వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 30న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని ఆయన వెల్లడించారు.

ఎంసీసీ కోడ్ తక్షణం అమలు

కోడ్ అమల్లోకి వచ్చినందున వెంటనే అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిధిలోని రాజకీయ నాయకుల చిత్రపటాలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బస్సులు, బస్ స్టేషన్లు, పబ్లిక్ ప్రదేశాల్లోని రాజకీయ పరమైన ప్రకటనలు, ఇతర చిత్రాలను తొలగించాలన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్లలో ఉన్న రాజకీయ పరమైన ఫొటోలను కూడా తొలగించాలని స్పష్టం చేశారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్లు, గ్రామీణ స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి ఎంసీసీ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు.

ప్రభుత్వ భవనాలు, వాహనాల వినియోగం, ఎన్నికల వ్యయం, ప్రోటోకాల్‌కు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికలతో సంబంధం ఉన్న ఏ ఒక్క అధికారి జిల్లాలో గాని ఇతర జిల్లాల్లో గాని రాజకీయ నాయకులకు సంబంధించిన ఎటువంటి సమావేశాలకు హాజరు కాకూడదన్నారు. స్థానిక సంస్థల సభ్యులు ఎటువంటి రాజకీయ సమావేశాలు నిర్వహించకూడదని, కలెక్టర్ ముందస్తు అనుమతితో అత్యవసర సమావేశాలు నిర్వహించవచ్చని పేర్కొన్నారు. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ప్రకటనలు, కార్యక్రమాలు చేపట్టకూడదన్నారు. మంత్రులు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత ప్రయాణాలకు సైరన్ కలిగిన ప్రభుత్వ వాహనాలు, పైలెట్ వాహనాలను వినియోగించకూడదని వెల్లడించారు.

ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ఎన్నికల ప్రకటనల కోసం అభ్యర్థులు ముందస్తు అనుమతి తప్పనిసరి అని కలెక్టర్ తెలిపారు. ప్రకటనల ధ్రువీకరణ, ప్రచార వ్యయ పర్యవేక్షణ, టి.వి.చానళ్లు/ కేబుల్ నెట్‌వర్క్, ప్రైవేట్ ఎఫ్.ఎం, సినిమా హాళ్లు, పబ్లిక్ ప్లేస్‌లో ఆడియో–విజువల్ డిస్‌ప్లే, ఎన్నికల ప్రచారానికి సంబంధించిన బల్క్ ఎస్ఎంఎస్‌లు/వాయిస్ మెసేజీలు, సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారాలను జిల్లా మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ అనుమతితో మాత్రమే నిర్వహించాలన్నారు.

అధికారులు మాత్రమే పింఛన్లు పంపిణీ చేయాలి

ప్రభుత్వ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తిస్థాయిలో అధికారుల సమక్షంలో మాత్రమే జరగాలని, రాజకీయ నాయకులు, ఇతర స్థానిక సంస్థల సభ్యులు ప్రమేయం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి మండలంలో వీడియోగ్రఫీ బృందాలను ఏర్పాటు చేయాలని, అనధికార డబ్బు, మద్యం తరలింపును పూర్తిస్థాయిలో అరికట్టాలని ఆదేశించారు. అధికారులందరూ ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ.. ఎమ్మెల్సీ ఉప ఎన్నికను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ, రెవెన్యూ, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప'రేషన్' తప్పదా!

గత నెల అనుకుంటే.. ఈ నెలలోనూ రేషన్‌కార్డులకు పూర్తిస్థాయిలో సరకులు అందే పరిస్థితి కనిపించడం లేదు. గత నెల ఇవ్వని సరకులతోపాటు ఈ నెలవి కలిపి ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. ఇప్పుడు బియ్యం, గోధుమ పిండితోపాటు రాగి పిండి స్థానంలో రాగులు దంచుకోమంటూ ఇవ్వడం కార్డుదారులకు ఒకింత ఇబ్బందికరమే..

- ఈ నెలలోనూ రేషన్ కార్డుదారులకు మొండిచెయ్యి
- కేటాయింపులు లేని పామాయిల్, కందిపప్పు, పంచదార
- రాగి పిండి స్థానంలో రాగులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన వాటిలో కోత

సాక్షి, అనకాపల్లి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 53 రోజులైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తారని ప్రజలంతా అనుకున్నారు. కానీ రోజు రోజుకూ ప్రభుత్వ తీరు చూస్తుంటే సంక్షేమాన్ని ఎగ్గొట్టే పరిస్థితి కనిపిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన బియ్యం, గోధుమ పిండి, పంచదార, రాగిపిండి, కందిపప్పు, వంట నూనె అందజేస్తారని భావించినా.. ఉన్న సరకుల్లో కోత విధించింది. కేవలం బియ్యం, గోధుమ పిండి మాత్రమే గత నెలలో పంపిణీ చేసింది. ఈ నెలలో పూర్తిస్థాయిలో ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. రాగిపిండి స్థానంలో రాగులు మాత్రమే ఈ నెల ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం ఏవి సరఫరా చేస్తే అవే ఇస్తామని చెబుతున్నారు. ఇంకా గోదాముల్లోనే కందిపప్పు మగ్గుతోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో దీని ధర మండిపోతోంది. ఇప్పటి వరకు ఎలాంటి ఇండెంట్ రాలేదని కందిపప్పు సరఫరా చేయడం లేదని డీలర్లు చెబుతున్నారు.

రేషన్ కార్డుదారుల ఆశలపై నీళ్లు

రేషన్ కార్డు ద్వారా బియ్యం సరఫరా జరుగుతోంది. రెండు, మూడు రేషన్ డిపోలకు కలిపి వాహనాల ద్వారా సరకులు అందిస్తున్నారు. ప్రస్తుతం యూనిట్‌కు నాలుగు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. గత నెలలో బియ్యం, గోధుమ పిండి మాత్రమే పంపిణీ చేశారు. ఆ నెల కోటాకు సంబంధించి ఎలాంటి ఇండెంట్ లేదని, అందువల్ల మిగిలిన పంచదార, రాగిపిండి, ఆయిల్‌ను ఈ నెల సరకులతో కలిపి పంపిణీ చేస్తామని కూటమి నాయకులు ప్రచారం చేశారు. దీంతో కార్డుదారులంతా వాటిని ఈ నెలతో కలిపి ఇస్తారని ఆశతో ఉన్నారు. అయితే ఈ నెల కోటా కింద పంచదార, గోధుములు సరఫరా చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో కార్డుదారుడికి అర కిలో పంచదార ఇచ్చేవారు. జూన్‌లో అర కిలో పంచదార రూ.17, గోధుములు కిలో రూ. 16 చొప్పున సరఫరా చేశారు.



జిల్లాలో వివరాలిలా..

జిల్లాలో 5,41,818 రేషన్ కార్డులు, 1,069 చౌక ధరల డిపోలు ఉన్నాయి. 374 ఎండీయూ (డోర్ టు డోర్ పంపిణీ) వాహనాలు ఉండగా, చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, 24 మండలాల డిప్యూటీ తహసీల్దార్లు ఈ విభాగంలో పనిచేస్తున్నారు.

ఈ నెల నుంచి రాగులు..

గత నెలలో బియ్యం, గోధుమ పిండి పంపిణీ చేశాం. ఈ నెలలో అదనంగా రాగులు ఇస్తున్నాం. మిగతా పంచదార, కందిపప్పు ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు లేవు. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన మరుక్షణం నుంచి అందిస్తాం.

– కె.వి.ఎల్.ఎన్ మూర్తి, జిల్లా పౌరసరఫరాల అధికారి, అనకాపల్లి జిల్లా

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

- మెజార్టీ ఓటర్లు ఆ పార్టీకి చెందినవారే..
- ప్రలోభాలకు తెరతీసిన కూటమి నేతలు

జెడ్పీటీసీలు	36
ఎంపీటీసీ	636
కౌన్సిలర్లు	53
కార్పొరేటర్లు	97
మొత్తం ఓటర్లు	822

మహారాణిపేట : ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచే అభ్యర్థి విజయం లాంఛనమే. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న ఓటర్లలో మెజార్టీ సభ్యులు వైఎస్సార్ సీపీకి చెందిన వారే ఉన్నారు. స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రస్తుతం 822 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా పరిషత్ పరిధిలో 39 మంది జెడ్పీటీసీ సభ్యులు ఉండాల్సి ఉండగా.. మూడు జెడ్పీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అరకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనకాపల్లి జిల్లా రావికమతం జెడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మ, సబ్బవరం జెడ్పీటీసీ సభ్యుడు తుంపాల అప్పారావు మరణించారు. ప్రస్తుతం ఉన్న 36 మందిలో 34 మంది జెడ్పీటీసీలు వైఎస్సార్ సీపీకి, నర్సీపట్నం జెడ్పీటీసీ సభ్యుడు తెలుగుదేశం పార్టీకి, అనంతగిరి జెడ్పీటీసీ సభ్యుడు సీపీఎం పార్టీకి చెందిన వారు ఉన్నారు. అలాగే 652 మంది ఎంపీటీసీలకు గానూ ప్రస్తుతం 636 మంది ఎంపీటీసీలు ఉన్నారు. 16 ఎంపీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. జీవీఎంసీలో 98 మంది కార్పొరేటర్లకు గానూ ఒక కార్పొరేటర్ స్థానం ఖాళీగా ఉంది. 21వ వార్డు నుంచి ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాస్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. తర్వాత ఆయన జనసేనలోకి ఫిరాయించడంతో శాసనమండలి చైర్మన్ అనర్హత వేటు వేశారు. ఆ స్థానానికే ఇప్పుడు ఎన్నిక జరుగుతోంది. ఇక యలమంచిలి పురపాలక సంఘం పరిధిలో 25, నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలో 28 మంది కౌన్సిలర్లు ఉన్నారు. 90 శాతం మంది వైఎస్సార్ సీపీకి చెందిన వారు ఉండడంతో ఆ పార్టీ అభ్యర్థి విజయం నల్లేరుమీద నడకే. ఈ పరిస్థితుల్లో కూటమి నేతలు కుట్రలకు తెరతీశారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. అభ్యర్థిని పోటీలో నిలిపేందుకు సన్నద్ధమవుతున్నారు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సునాయాసంగా విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు.

నేడు కోనాం జలాశయం నీరు విడుదల

చీడికాడ: మండలంలో కోనాం జలాశయం నుంచి ఖరీఫ్ సాగుకు నీరు విడుదల చేయనున్నట్లు ఏఈ జయరాం బుధవారం తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 99.40 మీటర్ల వద్ద నిలకడగా ఉందన్నారు. ప్రస్తుతం ఇన్ ఫ్లో 30 క్యూసెక్కులుగా నమోదవుతున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ల్యాబ్ సౌకర్యం లేని ప్రైవేటు ఐటీఐలు

- చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నర్సీపట్నం: జిల్లాలో ల్యాబ్ సదుపాయాలు లేని ప్రైవేటు ఐటీఐలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గీతాకృష్ణ, నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఐటీఐ కళాశాలలో ఐటీఐల జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ శ్రీనివాసచారికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ప్రాక్టికల్స్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పకుండా చూడాలని కోరారు. సరైన సౌకర్యాలు లేని ప్రైవేటు ఐటీఐలపై తక్షణమే చర్యలు తీసుకోని, విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలన్నారు. కోర్సులకు తగ్గ ల్యాబ్స్ లేని ప్రైవేట్ కళాశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డివిజన్ ప్రెసిడెంట్ జ్ఞానేష్, నాతవరం మండల సెక్రటరీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

కోటవురట్ల: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలు. రాజుపేట సర్పానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసి, ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్ మాకవరపాలేనికి చెందిన రుత్తల శ్రీనుదిగా పేర్కొన్నారు. అపరాధ రుసుం రూ.10 వేలు విధించినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 13 మందికి జరిమానా



వాహనదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ

అనకాపల్లి: మద్యం సేవించి వాహనాలు నడపుతున్న 13 మందిని కోర్టులో హాజరుపర్చగా, ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ సీఐ పైడపు నాయుడు తెలిపారు. బుధవారం కోర్టు ఆవరణలో వాహనదారులతో ఆయన మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపితే మీతోపాటు ఇతరుల ప్రాణాలకు హానిచేసే వ్యక్తులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

మహారాణిపేట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి సంబంధిత అధికారులంతా ప్రత్యేక చొరవ చూపాలని.. బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై డిస్ట్రిక్ట్ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించి.. కేసుల పరిష్కారానికి అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో భాగంగా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు రామారావు గత సమావేశంలో చర్చించి తీసుకున్న చర్యల గురించి వివరించారు. 138 కేసులు దర్యాప్తులో, 699 కేసులు కోర్టు ట్రయల్ రన్‌లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరగబోయే దాడులు, ఇతర చర్యలను ముందుగానే పసిగట్టి నివారించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పౌర హక్కులపై ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా అవగాహన కల్పించాలని.. వారు నివాసం ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేసుల పరిష్కారం, పరిహారం చెల్లింపులో బాధితులకు అండగా నిలవాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టు పరిధిలోని కేసులపై దృష్టి సారించాలన్నారు. పోలీస్ జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, డీసీపీ క్రైం రత్నం, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీరామ్మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీఆర్ మూర్తి, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, డీసీపీలు, ఏసీపీ పాల్గొన్నారు.

రైతే విత్తనం తయారు చేసుకోవాలి



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

నర్సీపట్నం: రైతు కొన్ని మెలకువలు పాటించి తన పొలంలో పంటనే విత్తనంగా తయారు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు సూచించారు. మున్సిపాలిటీ పరిధి బలిఘట్టంలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సొంతంగా విత్తనం తయారు చేయడం వల్ల గ్రామంలో వీటి కొరత ఉండదన్నారు. మిగిలిన రైతులకు అమ్ముకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రధానంగా విత్తన శుద్ధి చేసుకుంటే అధిక దిగుబడులు సాధించొచ్చన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీధర్ మాట్లాడుతూ మూడు దశల్లో విత్తన తయారీపై శిక్షణ ఇస్తామన్నారు. రైతులు సాంకేతిక సలహాలు పాటించాలన్నారు. ప్రతి రైతూ నాట్లు వేయు దశ మొదలుకుని పంట కోత వరకు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పంట పండించేటప్పుడు ప్రతి దశలో క్షేత్ర పరిశీలన చేసి నాణ్యమైన విత్తన తయారీకి సహకరిస్తామన్నారు. రైతులు తమవంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సుగుణ, ఏవో అప్పారావు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్‌లో బదిలీలు, పదోన్నతులు

- సీజీఎంలుగా బి.అశోక్‌కుమార్, టీవీఎస్ఎన్ మూర్తి
- విశాఖ సర్కిల్ ఎస్ఈగా శ్యామ్‌బాబు

సాక్షి, విశాఖపట్నం : తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) పరిధిలో పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి బదిలీ ఉత్తర్వులు బుధవారం జారీ చేశారు. ప్రాజెక్ట్స్ జీఎంగా ఉన్న బి.అశోక్‌కుమార్, రాజమండ్రి ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తిని చీఫ్ జనరల్ మేనేజర్లుగా పదోన్నతులు కల్పిస్తూ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ చేశారు. కార్పొరేట్ కార్యాలయం ఆపరేషన్స్-2 జీఎంగా ఉన్న జి.శ్యామ్ బాబుని విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈగానూ, ప్రస్తుతం విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈని క్వాలిటీ కంట్రోల్ జీఎంగా బదిలీ చేశారు. వీరితో పాటు పలువురు ఈఈల్ని జీఎంలుగానూ ఎస్ఈలుగానూ, డీఈలకు ఈఈలుగా ఏఈలని డీఈఈలుగా ప్రమోషన్ కల్పిస్తూ సీఎండీ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

జీవీఎంసీ ఇన్‌చార్జి సీఈగా వినయ్ కుమార్



సాక్షి, విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ) ఇన్‌చార్జి చీఫ్ ఇంజినీర్‌గా వినయ్‌కుమార్‌ను నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం చీఫ్ ఇంజినీర్‌గా వ్యవహరిస్తున్న రవికృష్ణరాజు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో వినయ్‌ని నియమించారు. ప్రస్తుతం వినయ్‌కుమార్ జీవీఎంసీ స్మార్ట్ సిటీ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈఎన్‌సీ ఆధ్వర్యంలో ప్యానెల్ నిర్వహించి.. సీనియర్‌కి చీఫ్ ఇంజినీర్‌గా అవకాశం కల్పించనున్నారు. అంతవరకు ఇన్‌చార్జి సీఈగా వినయ్ కుమార్ వ్యవహరించనున్నారు.

జీవీఎంసీ ఏడీసీగా రమణమూర్తి

విశాఖ సిటీ: జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా డి.వి. రమణమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఈ స్థానంలో విధులు నిర్వర్తిస్తున్న వి.సన్యాసిరావు డిప్యుటేషన్ పొడిగించలేదు. మాతృ సంస్థ జైళ్ల శాఖకు పంపించారు. అతని స్థానంలో కాకినాడలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డి.వి.రమణమూర్తిని డిప్యుటేషన్‌పై జీవీఎంసీ ఏడీసీగా నియమించారు.

భూ ఆక్రమణకు యత్నంపై ఫిర్యాదు



స్వాతి పొలంలో పీకేసిన మొక్కలు



మంచానపడ్డ తండ్రి వద్ద విచారంలో కుమార్తెలు

బుచ్చెయ్యపేట: తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిలో మొక్కలు పీకేసి, తనపై, తన తండ్రిపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పొట్టిదొరపాలేనికి చెందిన బొందల స్వాతి బుచ్చెయ్యపేట పోలీసులను బుధవారం ఆశ్రయించింది. వివాహ సమయంలో తండ్రి అర్జునరావు తనకు పసుపుకుంకుమ రూపంలో 7 సెంట్ల స్థలం ఇచ్చారని, తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుని, మొక్కలు వేసినట్లు పోలీసులకు తెలిపింది. అదే గ్రామానికి చెందిన కె.అప్పలనాయుడు, గంగాధర్‌లు తన భూమిలో మొక్కలను పీకేయడమే కాకుండా, ఆ భూమిని వదిలి వెళ్లకపోతే చంపేస్తామని తనను, తన తండ్రిని బెదిరిస్తున్నారని వాపోయింది. తాము ముగ్గురు అక్కచెల్లెళ్లమని, తండ్రికి ఇటీవలే గుండె ఆపరేషన్ అయిందని ఫిర్యాదులో పేర్కొంది. వారి నుంచి తమకు ప్రాణ హాని ఉందని, మగ దిక్కులేని తమను బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని పోలీసులను వేడుకుంది.

రహదారి భద్రతపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఆర్టీవో మనోహర్

అనకాపల్లి: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా రవాణా శాఖాధికారి జి.మనోహర్ తెలిపారు. బుధవారం స్థానిక ఏఎంఏఎల్ కళాశాల ఆవరణలో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వ్యక్తులు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ అండ్ డ్రైవ్ మీతోపాటు ఇతరులకు హాని చేసిన వారవుతారన్నారు. మైనర్ డ్రైవింగ్‌ను తల్లిదండ్రులు పూర్తిగా నిషేధించాలని కోరారు. అంతకు ముందు విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాలను చూపించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ జి.జయబాబు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పి.గోపీకృష్ణ, సాయి రమేష్, కె.నాగరాజు, ఎం.శివాని, టి.విజయభారతి, ఎ.గీత కావ్య పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

యలమంచిలి రూరల్: మండలంలోని పురుషోత్తపురం హైవే కూడలి వద్ద బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గూనపాటి ప్రకాశమ్మ(73) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు. అనకాపల్లి మండలం బవులువాడకు చెందిన ప్రకాశమ్మ మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. కుటుంబీకులు ఆమె కోసం వెతుకుతున్నారు. బుధవారం తెల్లవారుజామున పురుషోత్తపురం వద్ద ప్రమాదానికి గురైన ఆమెను అంబులెన్సులో యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని అనకాపల్లి మార్చురీలో భద్రపరచి మృతురాలి ఫోటోలను సామాజిక మాధ్యమాల ద్వారా షేర్ చేయగా, కుటుంబీకులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు యలమంచిలి రూరల్ పోలీసులు తెలిపారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి దృష్టికి కోర్టు సమస్యలు



జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్‌తో బార్ అసోసియేషన్ సభ్యులు

నర్సీపట్నం: స్థానిక కోర్టు సముదాయంలోని పలు సమస్యలను ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ దృష్టికి తీసుకెళ్లామని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మెట్టా ప్రభాకర్, కార్యదర్శి అనిమిరెడ్డి శివకృష్ణ తెలిపారు. నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులు బుధవారం విశాఖపట్నంలో న్యాయమూర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అదనపు జిల్లా న్యాయస్థానం ఏర్పాటు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నియామకం, కోర్టు రెండో అంతస్తు నిర్మాణానికి అనుమతులు, మహిళా న్యాయవాదులకు వసతి కల్పించాలని ఆయన్ను కోరినట్లు ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. న్యాయమూర్తిని కలిసిన వారిలో రాష్ట్ర బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.కృష్ణమోహన్, స్థానిక వైస్ ప్రెసిడెంట్ కోసూరు అప్పలనాయుడు, మాజీ కార్యదర్శి లోకా లోవరాజు, కె.వి.రమణ, వి.గోవిందరావు ఉన్నారు.

వెన్నలపాలెంలో సినిమా షూటింగ్ సందడి



హీరోయిన్ శిరీష

నాతవరం: మండలంలోని మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెంలో బుధవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. 'రాయివలస' టైటిల్‌తో తీస్తున్న సినిమాలో పలు సన్నివేశాలను ఇక్కడ లాలం సింహాచలం పాత పెంకుటిల్లులో చిత్రీకరించారు. హీరో హీరోయిన్లుగా కార్తీక, శిరీష నటిస్తున్నారు. హీరోయిన్ తండ్రి పాత్రతోపాటు పలు సన్నివేశాలను ఉదయం నుంచి సాయంత్రం వరకు షూట్ చేశారు. గ్రామంలో తొలిసారిగా సినిమా షూటింగ్ జరగడంతో గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల వారు, స్థానిక జీడిపిక్కల ఫ్యాక్టరీలో పని చేస్తున్న మహిళా కార్మికులు చూసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరిని నివారించేందుకు సినిమా యూనిట్ బృందం నానా అవస్థలు పడింది. సినిమాకు డైరెక్టరుగా రాధిక వ్యవహరిస్తున్నారు. హీరోయిన్ తండ్రిగా తమిళ నటుడు జయరాజ్ వ్యవహరించే పలు దృశ్యాలను చిత్రీకరించారు.

పురోహిత సమాఖ్య జిల్లా అధ్యక్షునిగా మూర్తి



అధ్యక్షునిగా ఎన్నికైనట్టు ధృవీకరణ పత్రం అందుకుంటున్న మూర్తి

యలమంచిలి రూరల్: అనకాపల్లి జిల్లా పురోహిత సమాఖ్య అధ్యక్షునిగా యలమంచిలికి చెందిన గాయత్రి సేవా ట్రస్ట్ కార్యదర్శి, వేద పాఠశాల నిర్వాహకుడు పెద్దింటి సూర్యనారాయణమూర్తి ఎన్నికయ్యారు. బుధవారం విశాఖలోని శిల్పారామంలో జరిగిన రాష్ట్ర సమాఖ్య సమావేశంలో మూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో యలమంచిలి పురోహిత సమాఖ్యకు అధ్యక్షునిగా పనిచేసిన మూర్తి యలమంచిలి భవనం వీధిలో గాయత్రి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేద పాఠశాల నిర్వహిస్తున్నారు. జిల్లాలో పురోహితుల సంక్షేమానికి కృషి చేస్తానని అధ్యక్షునిగా ఎన్నికైన మూర్తి మీడియాకు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిపై పోక్సో కేసు

అనకాపల్లి: మైనర్ బాలిక(14)పై అత్యాచారం చేసి, గర్భవతిని చేసిన ఇంటర్ విద్యార్థిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు. వి.మాడుగుల మండలం కింతలివల్లాపురం గ్రామానికి చెందిన కుటుంబం పనుల నిమిత్తం అనకాపల్లి మండలం ఊడేరు గ్రామానికి వలస వచ్చారు. అదే గ్రామానికి చెందిన 17 ఏళ్ల ఇంటర్ విద్యార్థి బాలికపై అత్యాచారం చేశాడు. ప్రస్తుతం 5వ నెల గర్భవతి. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి నిర్మాణ కార్మికుడి మృతి

అనకాపల్లి: విద్యుత్ వైర్లు తగిలి కూండ్రం గ్రామానికి చెందిన గనిసెట్టి రాజాబాబు(53) మృతి చెందినట్లు పట్టణ సీఐ జి.శంకరరావు తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాలు. మృతుడు రాజాబాబు రోజువారి కూలి పనుల్లో భాగంగా వేల్పులవీధిలో భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగిలి కిందకు పడిపోవడంతో, హుటాహుటిన ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాజాబాబు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అల్లుడి దాడిలో గాయపడిన మామ మృతి

- జంట హత్యల కేసుగా నమోదు
- నిందితుడికి రిమాండ్



మృతుడు పైడిరాజు (ఫైల్)



నిందితుడు మామిడి వెంకట పైడంనాయుడు

చోడవరం రూరల్: అనకాపల్లి జిల్లా చోడవరం మండలం అడ్డూరులో మంగళవారం వెలుగు చూసిన అత్త హత్య, మామపై హత్యాయత్నం కేసు కాస్తా జంట హత్యల కేసుగా మారింది. అల్లుడి చేతిలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మామ పైడిరాజు బుధవారం మరణించాడు. దీంతో ఈ కేసును జంట హత్యల కేసుగా నమోదు చేసినట్లు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. నిందితునిపై 256/2024, భారత న్యాయ సంహిత-2023లోని 103(1), 109, 85 సెక్షన్లతోపాటు డీపీ యాక్టు 3, 4 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నిందితుడు మామిడి వెంకటపైడంనాయుడును బుధవారం చోడవరం కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

ఆస్తి కోసమే అఘాయిత్యం

ప్రేమ పేరిట అత్యాచారం చేసి, పోక్సో కేసు నమోదవగా, దాని నుంచి తప్పించుకునేందుకు పెళ్లి చేసుకున్న నిందితుడు ఇద్దరు ఆడపిల్లలు పుట్టాక డబ్బు, ఆస్తి కోసం ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు. కొన్ని నెలలుగా రూ.10 లక్షల నగదు, ఎకరం సాగు భూమిని పుట్టింటి నుంచి తేవాలని బంధువులతో కలసి భర్త(నిందితుడు) పైడంనాయుడు భార్య పూర్ణసంధ్యను వేధింపులకు గురి చేశాడు. ఆస్తి దక్కడానికి అత్తమామలు సానబోయిన లక్ష్మి, పైడిరాజులు ప్రధాన అడ్డంకిగా భావించాడు. దీంతో సోమవారం రాత్రి అత్తారింటికి వెళ్లి కత్తితో విచక్షణారహితంగా అత్తపై దాడి చేశాడు. ఆమె అక్కడికక్కడే మరణించగా, మామ పైడిరాజుపై కూడా అదే కత్తితో దాడికి దిగాడు. పొట్ట చీలిన పైడిరాజును కేజీహెచ్‌కు తరలించారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడిన ఆయన బుధవారం తెల్లవారుజామున 2 గంటలకు మరణించినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న



మాడుగుల సీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

మాడుగుల రూరల్: జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి, జ్వరపీడితులకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం ఆయన పార్టీ మండల కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తితో కలిసి మాడుగుల కమ్యూనిటీ ఆస్పత్రిని పరిశీలించారు. వార్డుల్లో రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో జ్వరపీడితుల సంఖ్య పెరిగిందన్నారు. గిరిజన గ్రామాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. పీహెచ్‌సీల్లో మందుల తోపాటు మలేరియా, టైఫాయిడ్ కిట్లు కొరత ఎక్కువగా ఉందని వాపోయారు. దీనివల్ల జ్వరపీడితులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. చీడికాడ మండలం కోనాం శివారు జాజులపాలెం గ్రామానికి చెందిన కాకర లక్ష్మి జ్వరంతో చనిపోయిందని, దాయిరి నూకరాజు, వంతల గాటీబాబు జ్వరంతో మాడుగుల సీహెచ్‌సీలో చేరారన్నారు. ఇదే గ్రామంలో మరి కొంతమంది జ్వరాలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ల్యాబ్‌లో మలేరియా పరీక్షలు చేస్తున్నా, ఇంజెక్షన్లు లేవని ఆరోపించారు. గ్రామాల్లో మలేరియా కేసులు నమోదవుతున్నా ఉన్నతాధికారులకు చెప్పడం లేదన్నారు. మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రి అధ్వానంగా ఉందన్నారు. వర్షం కురిస్తే, ల్యాబ్ టెక్నీషియన్ రూమ్ శ్లాబ్ పెచ్చులూడి రాలిపోతుందని ఆరోపించారు. గతంలో మరమ్మతులు చేసినా సరే ప్రయోజనం లేదన్నారు. ఎన్నో ఆశలు పెట్టుకోని కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపిస్తే, ప్రజల ఆశలు నీరుగార్చారని విమర్శించారు. పేదలకు అందించే వైద్యం పట్ల దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల సీనియర్ నాయకులు గండి నాయనిబాబు, కె.భవానీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు స్వామి వారికి తుది విడత చందనం సమర్పణ

అనకాపల్లి : స్థానిక గవరపాలెం దిబ్బవీధి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం ఉదయం స్వామివారికి తుది విడత చందనం అలంకరణ నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతకు ముందు స్వామివారికి స్వర్ణ సంపెంగ పుష్పాలతో అర్చన కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఆరవెల్లి సత్యప్రసాదాచార్యులుచే నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి : స్థానిక విద్యుత్‌శాఖ డీ-1 సెక్షన్ పరిధిలో వీధి దీపాల మరమ్మతు పనుల నిమిత్తం గురువారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డి-1 సెక్షన్ పరిధిలో కోట్ని వీధి, గాంధీబొమ్మ జంక్షన్, పెరుగు బజార్ జంక్షన్, మళ్లవీధి, తాకాశివీధి, రావుగోపాలరావు కళాక్షేత్రం ఏరియా, న్యూకాలనీ, వేల్పులవీధి బాలికోన్నత పాఠశాల, ఎల్ఐసీ ఆఫీస్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు సహకరించాలని వారు కోరారు.

రేపు వ్యవసాయ విద్యుత్‌కు..

కశింకోట : కశింకోటలోని వ్యవసాయ విద్యుత్‌కు ఆగస్టు 2 ఉదయం 7 నుంచి 12 గంటల వరకు అంతరాయం కలగనుందని డివిజన్ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. కొత్తూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆ రోజు నిర్దేశిత సమయంలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి తమకు సహకరించవలసిందిగా రైతులను కోరారు.

ఫ్లూ జ్వరాలపై అప్రమత్తం

నర్సీపట్నం: ఫ్లూ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం నాయకుడు, చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ లక్ష్మీకాంత్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫ్లూ జ్వరాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. ఫ్లూ జ్వరాల పట్ల ప్రజలను మీడియా ద్వారా అప్రమత్తం చేసేందుకు తన వంతు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. వాతావరణంలో మార్పులతో పాటు, భారీగా కురుస్తున్న వర్షాలకు ఫ్లూ జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. చిన్నపిల్లలు, 60 ఏళ్లు దాటిన వృద్ధులు ఎక్కువగా వీటి బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. దీని ప్రభావం జూన్ నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు ఉంటుందన్నారు. జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, వీరేచనాలుంటే జాగ్రత్తపడాలన్నారు.

అనకాపల్లి సినిమాలు

డెడ్‌పూల్ వుల్వరీన్	: రాజా
కల్కి 2898ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
డెడ్‌పూల్ వుల్వరీన్ 3డీ తెలుగు	: సత్యనారాయణ స్క్రీన్-2
రాయన్	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
పురుషోత్తముడు	: వెంకటేశ్వర
రామ్ ఎన్ఆర్ఐ	: శ్రీసత్య
ఆపరేషన్ రావణ్	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 8 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	--	--
మూడోరకం	3,450	3,450

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-7 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 387 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 361 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

రైతులకు మేలు చేసే.. భూసార పరీక్షలు



మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

- నివేదిక ఆధారంగా విత్తనాల వాడకం
- ఖర్చు తగ్గి.. దిగుబడి పెరిగే అవకాశం

కశింకోట : మండలంలోని పంట భూములకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు నిర్వహించడానికి అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు పంట భూములను సందర్శించి మట్టి నమూనాలు సేకరించారు. మండలంలో 729 మట్టి నమూనాల సేకరణ ఇప్పటి వరకు పూర్తి చేశారు. వీటిని భూసార పరీక్షా కేంద్రానికి పంపడానికి పంపనున్నారు. ప్రభుత్వం ఏటా మట్టి నమూనాలు సేకరించి ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు నివేదిక అందజేస్తుంది. ఈ మేరకు ఈ ఏడాది కూడా మండలంలో ఏఈవోలు, వీహెచ్ఏలు, వ్యవసాయ సహాయకులు తమకు నిర్దేశించిన గ్రామాల్లో పంట భూముల్లో పర్యటించి మట్టి నమూనాలను సేకరించారు. ఒక్కొక్కరికి లక్ష్యాన్ని నిర్దేశించిన మేరకు పంట భూములను సందర్శించి రైతుల సహకారంతో మట్టి నమూనాలు సేకరించారు. సాధారణంగా ఏటా ఏప్రిల్‌లో మట్టి నమూనాలు సేకరించి వాటిని అనకాపల్లిలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పని చేసే భూసార పరీక్షల ల్యాబ్‌కు పంపిస్తారు. అక్కడ వ్యవసాయ శాఖ అధికారులు, నిపుణులు, ఇతర సిబ్బంది పరీక్షలు జరుపుతారు. అనంతరం వాటి వివరాలను రైతులకు అందజేస్తారు. ఇందుకు దాదాపు మూడు నెలల వరకు సమయం పడుతుంది. సాధారణంగా ఖరీఫ్‌లో వరి పంట వేసే సమయానికి నివేదికలు రైతులకు అందిస్తారు. అందుకు అనుగుణంగా ఏ మేరకు ఎరువులు వాడాలి, ఎటువంటి రకం ఎరువులు వాడాలి తదితర వివరాలను ఈ సందర్భంగా తెలియజేస్తారు. దీంతో అందుకు అనుగుణంగా సాగు చేపట్టి రైతులు పంటలు పండిస్తారు. దీనివల్ల అనవసర ఎరువుల వాడకం తగ్గి పెట్టుబడి ఖర్చులు మిగులుతాయి. అధిక పంట దిగుబడి లభించి ఆదాయం కూడా సమకూరుతుంది. రైతుకు ప్రయోజనం కలుగుతుంది. మండలంలో ఏటా 1200 హెక్టార్లలో ఖరీఫ్ వరి, 331 హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నారు.

మట్టి నమూనాల సేకరణ ఆలస్యం..

అయితే ఈ ఏడాది మట్టి నమూనాల సేకరణ దాదాపు నాలుగు నెలలు ఆలస్యం అయింది. సార్వత్రిక ఎన్నికలు ఈ ఏడాది జరగడం, ప్రభుత్వం మారడంతో పరీక్షల నిర్వహణ ఆలస్యం అయింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి భూసార పరీక్షలు నిర్వహించడానికి నిర్దేశించాల్సి ఉన్నందున పరీక్షలకు జాప్యం జరిగిందని అధికారిక సమాచారం. భూసార పరీక్షలు నిర్వహించి ఇచ్చే నివేదిక ఆధారంగా 3 ఏళ్ల వరకు పంటలు సాగు చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది. ఆ తర్వాత మళ్లీ భూసార పరీక్షలు అవసరం అవుతాయి. అందువల్ల అందరి భూములు ఒకేసారి కాకుండా ఏటా ర్యాండంగా వరి, చెరకు పంటలు సాగు చేసే భూములకు పరీక్షలు నిర్వహిస్తారు. గతంలో ఒక్కొక్క సిబ్బంది 30 వంతున మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలకు పంపేవారు. ఈ ఏడాది లక్ష్యాన్ని పెంచారు. ఒక్కొక్కరికి 52 మట్టి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపాలని అధికారులు నిర్దేశించారు. ఈ మేరకు మట్టి నమూనాల సేకరణ తాజాగా పూర్తి చేశారు. వీటి నివేదిక మరో మూడు నెలల తర్వాత రానుంది. అప్పటి నుంచి నివేదిక ఆధారంగా పంటల సాగు చేపడతారు. మూడేళ్ల పాటు నివేదిక ఆధారంగా పంటల సాగు చేయవచ్చు.



కశింకోట వ్యవసాయ సిబ్బంది భూసార పరీక్షలకు సేకరించిన మట్టి నమూనాలు

భూసార పరీక్షలతో పెట్టుబడి ఖర్చులు ఆదా..

మండలంలో ఈ ఏడాది 729 మంది రైతుల నుంచి మట్టి నమూనాలు సేకరించాం. వాటిని భూసార పరీక్షలకు అనకాపల్లిలో ఉన్న భూసార పరీక్ష ల్యాబ్‌కు పంపుతున్నాం. దాదాపు మూడు నెలలలోగా నివేదిక రానుంది. వాటి ఆధారంగా పంటలను సాగు చేసి ఎరువుల వాడకం తగ్గి రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గుతాయి. అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుంది. భూసార పరీక్షల నివేదిక ఆధారంగా మూడేళ్ల పాటు పంటలు సాగు చేయడానికి అవకాశం ఉంటుంది. ఎన్నికలు, తదితర కారణాల వల్ల ఈ ఏడాది మట్టి నమూనాల సేకరణ ఆలస్యం అయింది.

– ఎం.స్వప్న, మండల వ్యవసాయ శాఖ అధికారి, కశింకోట

50 ఏళ్లు నిండిన బీసీలకు పింఛన్ ఇవ్వాలి



రమణబాబు

అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికల్లో 50 సంవత్సరాలు దాటిన బీసీలకు పింఛన్ సౌకర్యం కల్పిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్షణమే అమలు చేయాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మొల్లి రమణబాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు రెండు మాసాలు అవుతున్నప్పటికీ బీసీ కులాలకు ప్రభుత్వ పింఛన్‌పై ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో ఉన్న స్థానికులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని, రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న 139 బీసీ కులాలకు తక్షణమే కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని కోరారు. నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు, రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి కల్పిలంచాలన్నారు.

భారత్ వికాస్ పరిషత్ సర్వసభ్య సమావేశం

అనకాపల్లి : స్థానిక నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో భారత్ వికాస్ పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పరిషత్ పట్టణ అధ్యక్షుడు జి.వర్మ మాట్లాడుతూ పరిషత్ ఆధ్వర్యంలో ఏడాది పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు తీర్మానాలు చేశామన్నారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తమ వంతు ప్రతి ఏడాది మాదిరిగానే సహాయ సహకారాలు అందిస్తామన్నారు. త్వరలో అనకాపల్లి పట్టణంలో విద్యార్థులకు రాష్ట్రస్థాయి గ్రూప్ సాంగ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ చేసిన కాంగ్రెగుల దుర్గాప్రసాద్‌ను పరిషత్ సభ్యులు ఘనంగా సత్కరించారు. అంతకు ముందు దివ్యాంగ పిల్లలకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి శివరాం, డాక్టర్ శ్యామ్, ఎస్.గోపాలరావు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న పరిషత్ సభ్యులు

చేపల వేటకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెంలో నేవల్ బేస్ నిర్మిస్తున్న ప్రదేశంలో ఉన్న మొగలో నుంచి త్వరలో చేపల వేట బోట్లు నిలిపేయాల్సి వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పరిశీలిస్తున్నామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ అన్నారు. బంగారమ్మపాలెం తీరాన్ని బుధవారం మత్స్య శాఖ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. బంగారమ్మపాలెం మొగ నుంచి సుమారు నాలుగు గ్రామాల మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లి వచ్చేవారని, నేవల్ బేస్ నిర్మాణ క్రమంలో ఈ దారి మూసేయాల్సి వస్తుందనే సమాచారం మేరకు చేపల వేటకు ప్రత్యామ్నాయంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. స్థానిక అనుకూలతను పరిశీలించి ఏర్పాట్లు చేస్తామన్నారు. అదే సమయంలో సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, స్థానిక గ్రామ పెద్దలు పరిశీలనకు వచ్చిన అధికారులతో మాట్లాడారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా తమకు పూర్తి స్థాయిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నేవల్ బేస్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు హామీ ఇచ్చారు. డీఎఫ్‌వో ప్రసాద్, ఎఫ్‌డీవో రవితేజ, నేవల్ డిప్యూటీ తహసీల్దార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బంగారమ్మపాలెం తీరాన్ని పరిశీలిస్తున్న ఎస్‌డీసీ మనోరమ, అధికారులు

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఫ్లెక్సీల తొలగింపు

అనకాపల్లి : విశాఖ ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున జీవీఎంసీ పరిధిలో ఫ్లెక్సీలను బుధవారం టౌన్ ప్లానింగ్ ఉద్యోగుల తొలగించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అన్ని ప్రాంతాల్లో ఉన్న బోర్డులను దశల వారీగా తొలగించనున్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పారు.



సుంకరమెట్ట జంక్షన్ వద్ద బోర్డులను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు

గొటివాడ ఆరోగ్య కేంద్రానికి గుర్తింపు

సేవల్లో రెండో స్థానం

సబ్బవరం: గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో మండలంలోని గొటివాడ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం జిల్లాలో రెండో స్థానంలో నిలిచిందని సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ చక్రవర్తి తెలిపారు. గత నెల 4వ తేదీన ఎన్‌కాస్(నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్) ప్రోగ్రామ్‌లో భాగంగా ఢిల్లీ నుంచి డాక్టర్ రాజేశ్వర్,డాక్టర్ జయలక్ష్మి బృందం ఆయుష్మాన్ కేంద్రాన్ని సందర్శించిందని చెప్పారు. రోగులతో మాట్లాడి కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీయడంతో పాటు రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారన్నారు. గ్రామంలోని పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారన్నారు.ఈ మేరకు బుధవారం కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని చెప్పారు. ఈ మేరకు వైద్య సిబ్బందిని సర్పంచ్ సాలాపు మీనా వెంకటేశ్వరరావు దంపతులు అభినందించారు.కార్యక్రమంలో డాక్టర్ ఆశాలత,సీహెచ్‌వో స్వర్ణలత, ఎంపీహెచ్‌ఈవో జేసుదాసు,ఆర్ శిరీష, ఏఎన్ఎం సుధారాణి, కె.శివ అప్పలనాయుడు,పైడిరాజు,కృష్ణవేణి,చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



గొటివాడ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య సిబ్బందితో సర్పంచ్ సాలాపు మీనా తదితరులు

ఉపాధి కల్పనే లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ

పరవాడ: యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా చెప్పారు. సంస్థ ఆధ్వర్యంలో ఆర్నెల్ల పాటు నిరుద్యోగ యువతకు కల్పించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో సిన్హా మాట్లాడారు. నిరుద్యోగ యువతకు విజయవాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సహకారంతో శిక్షణ అందించినట్టు తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్లతో పాటు శతశాతం హామీతో కూడిన జాబ్ ఆఫర్ లెటర్లను ప్రాజెక్టు హెడ్ సిన్హా అందజేశారు.



ట్రైనీలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రాజెక్టు హెడ్ సిన్హా

సమాజాన్ని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

చోడవరం: సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడు ఎంతో కీలకమని, అలాంటి ఉత్తమ ఉపాధ్యాయుల్లో వెదురుపర్తి నాగేశ్వరరావు మాస్టారు ఒకరని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, వేపాడ చిరంజీవి కొనియాడారు. రావికమతం మండలం దొండపూడి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరరావు పదవీవిరమణ సందర్భంగా హైస్కూల్ ఆవరణలో బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. నాగేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఈవో అప్పారావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, ఎంపీటీసీ కొప్పాక లక్ష్మి, సర్పంచ్ రాజులమ్మ, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ సిరిపోల్ల తమ్మునాయుడు, జీపీఎస్ నాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



హెచ్ఎం నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీలు రఘువర్మ, చిరంజీవి, ప్రజాప్రతినిధులు

కుష్టు వ్యాధి లక్షణాలపై అప్రమత్తం

కె.కోటపాడు: శరీరంపై రాగి రంగు మచ్చలతో పాటు స్పర్శలేని మచ్చలున్నవారు వైద్య సిబ్బందిచే కుష్టు వ్యాధి నిర్ధారిత పరీక్షలు చేయించుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. కె.కోటపాడు హెల్త్ సబ్ సెంటర్ వద్ద బుధవారం కుష్టువ్యాధి లక్షణాల అనుమానితులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు కుష్టును ప్రాథమిక దశలో గుర్తిస్తే వైకల్యం బారిన పడకుండా చికిత్స పొందవచ్చన్నారు. కుష్టు రోగులకు ఇంటి వద్దే అవసరమైన ఎండీటీ మాత్రలను తమ సిబ్బంది అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు నళిని, ఎంఎల్‌హెచ్‌పీ ఉమ తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో భద్రంగా బుజ్జాయిలు

సకాలంలో వ్యాక్సిన్లతో గర్భిణులు, శిశువులకు రక్షణ



మళ్లవీధి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న ఏఎన్ఎంలు

అనకాపల్లి : మారుతున్న కాలానికి అనుగుణంగా బిడ్డ జన్మించినప్పటి నుంచి వివిధ రకాలైన వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధిక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలి. అప్పుడు పుట్టిన చిన్నారుల వరకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో ఆయా టీకాలు, వ్యాక్సిన్‌లు వేయిస్తే వ్యాధులు దరి చేరకుండా జీవితాంతం ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు టీకాలపై సరైన అవగాహన లేక వివిధ రకాల వ్యాధులకు గురవుతుంటారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కూడా కోల్పోతుంటారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధిక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ స్థాయి నుంచి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి బుధ, శనివారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.

వ్యాక్సిన్లతో వ్యాధులకు అడ్డుకట్ట..

- గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలలు నిండిన తర్వాత టీటీ ఇంజక్షన్ వేసుకోవాలి. నెల రోజుల వ్యవధిలో మరో టీటీ ఇంజక్షన్ వేసుకోవాలి. వీటితో పాటు ఐరన్ ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు వేసుకోవాలి. ప్రసవం అనంతరం ఐరన్ టాబ్లెట్లు తీసుకోవాలి.
- అప్పడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్-బి డోసు వేయాలి. వీటివలన పోలియో, పచ్చకామెర్ల నుంచి రక్షణ కలుగుతుంది.
- 14 రోజుల వ్యవధిలో టీబీ రాకుండా బీసీజీ టీకా వేయించాలి.
- ఆరు, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి. వీటితో పాటు 6,10,14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటి వల్ల కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మొదడువాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడవచ్చు.
- తొమ్మిది నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్-ఎ చుక్కలు వేయించాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోస్ డీపీటీ, మీజిల్స్, విటమిన్-ఏ ఓపీ వేయించాలి. ఐదేళ్లు పూర్తయిన తర్వాత డీపీటీ డోసు వేయించాలి.
- 10,16 సంవత్సరాలు పూర్తయితే టెట్నాస్ (టీటీ) ఇంజక్షన్ వేయించాలి.



మిరియాల కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న ఏఎన్ఎంలు



బాలలింతల అంగన్‌వాడీ ఇంజక్షన్ పుస్తకాలు

- తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి విటమిన్-ఎ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు వేయించాలి.

జన్మించిన ప్రతి శిశువుకు టీకాలు వేయించాలి..



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధిక టీకాలు సకాలంలో వేయించాలి. వీటి వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడవచ్చు. ఎప్పటికప్పుడు గ్రామీణ స్థాయి నుంచి వివిధ రకాలైన వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ఇంటింటి ప్రచారం చేపడుతున్నారు.

– వాణీ జగదీశ్వరి, తుమ్మపాల, పీహెచ్‌సీ వైద్యురాలు

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పక్కాగా అమలు



పంచాయతీ కార్యదర్శులతో సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పలరాజు

దేవరాపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామాల్లో పక్కాగా నిబంధనలు అమలు చేయాలని దేవరాపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అప్పలరాజు క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి.సంతోషి నళినితో కలిసి బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. జూలై 30 నుంచి కోడ్ అమల్లోకి వచ్చినందుకు గ్రామాల్లో అన్ని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, జెండాలను తొలగించి, రాజకీయ ప్రముఖుల విగ్రహాలకు ముసుగు వేయాలని సూచించారు. పింఛన్ల పంపిణీని గురువారం తెల్లవారుజాము నుంచి ప్రారంభించాలని మ్యాపింగ్ చేసిన అధికార్లు, పంచాయతీ సెక్రటరీలకు తెలిపారు.

ముమ్మరంగా వరినాట్లు

గొలుగొండ: మండలంలో విప్పలపాలెం ఆయకట్టు, రావణాపల్లి జాలాయశం, దారగెడ్డ దిగువున రైతులు ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. పై మూడు ప్రాంతాల్లో సుమారు నాలుగువేల ఎకరాల్లో ఈ పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో నీటి సౌకర్యం అధికంగా ఉండటం వల్ల ముందుగా నాట్లు వేస్తారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు రైతులకు కలిసి వచ్చాయి. ప్రస్తుతం దమ్ములతో పాటు నాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

అంకితభావంతో గుర్తింపు

మునగపాక: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. మండలంలోని వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం రత్నరాజు పదవీ విరమణ సందర్భంగా హైస్కూల్ ఆవరణలో బుధవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో రత్నరాజు ఎంతో కృషి చేశారని, ఇతర ఉపాధ్యాయులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పెద్దలు పెతకంశెట్టి రామజోగినాయుడు, మళ్ల వరహా నరసింగరావు, సూరిశెట్టి రాము, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల హృదయాల్లో ఉపాధ్యాయుడి స్థానం పదిలం

యలమంచిలి రూరల్: విద్యార్థుల హృదయాల్లో ఉపాధ్యాయుడి స్థానం ఎప్పటికీ పదిలంగా ఉంటుందని యలమంచిలి ఉపవిద్యాశాఖాధికారి అప్పారావు అన్నారు. యలమంచిలి జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఇంగ్లిష్ అసిస్టెంట్ జి.ఐ.సత్యంబాబు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సత్యంబాబును ఎంఈవోలు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. 29 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా ఆయన అందించిన సేవలను ప్రశంసించారు. ఎంఈవోలు మీనాక్షి, అరుణ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని వీవీ హిమబిందు పాల్గొన్నారు.